కష్టం..నష్టం



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు

రైతన్నల రెక్కల కష్టం వర్షార్పణమైంది. విత్తు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పైర్లు భారీ వర్షాలకు నీట మునిగాయి. కూటమి ప్రభుత్వం పైసా సాయం చేయకపోయినా అప్పు చేసి మరీ పెట్టుబడులు పెట్టిన అన్నదాతలు ఇప్పుడు వాటిని తీర్చే మార్గం ఎలా అని దిగాలు చెందుతున్నారు. వేల ఎకరాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించిన అధికారులు పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. పరిహారం ఇచ్చి అన్నదాతలను ఆదుకుంటుందా చేతులెత్తేస్తుందో వేచి చూడాలి.

– ఆత్మకూరు

- సాధారణం కంటే గరిష్టస్థాయిలో వర్షపాతం నమోదు
- వందలాది ఎకరాల్లో పంట నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

ఆత్మకూరు డివిజన్‌లో ఈ యేడాది రికార్డుస్థాయిలో వర్షాలు కురిశాయి. సుద్దవాగు, గుండ్లకమ్మ, బవనాసి వాగులు పొంగి ప్రవహించడంతో పాటు వరదరాజుస్వామి ప్రాజెక్టు నిండడం, సిద్ధాలుగు ఎక్కి పారడంతో రైతులు సాగుచేసిన పంట పొలాలు నీట మునిగాయి. మొక్కజొన్న, మినుము, కంది, మిర్చి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. కొత్తపల్లి మండలంలో సుద్దవాగు, పడవాగు వల్ల పంటలు వందలాది ఎకరాల్లో నీట మునిగాయి. పాములపాడు మండలంలోని భవనాశి, సుద్దవాగు వల్ల వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొత్తానికి ఆత్మకూరు డివిజన్‌లోనే 3 వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. అందులో ఆత్మకూరు మండలంలో 1,250 ఎకరాలలో మొక్కజొన్న, పాములపాడు మండలంలో 900 ఎకరాలు, కొత్తపల్లి మండలంలో 850 ఎకరాలలో మొక్కజొన్న, మినుము, పత్తి, మిర్చి, కంది పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు జిల్లా అధికారులకు పంపారు.

భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంలో భారీ వర్షాలు కురిశాయి. ఆగస్టు నెలలో సాధారణంగా ఆత్మకూరు మండలంలో 120 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా కేవలం నాలుగు రోజులకే 120 మి.మీటర్లు కురిసింది. ఈనెలలో రెండు, మూడు రోజులకోసారి ప్రతివారం 2.6 మి.మీ. నుంచి 59.7 మి.మీ. వరకు వర్షపాతం నమోదైంది. దీంతో పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. మొక్కజొన్న పంటలో నడుము లోతు నీళ్లు నిలిచాయి. ఇప్పటికే కంది, పత్తి తదితర పంటలను పూర్తిగా నష్టపోయారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల దాక పెట్టుబడులు పెట్టిన రైతులకు చిల్లిగవ్వ కూడా చేతికందే పరిస్థిత లేకుండా పోయింది.

రూ.లక్ష దాకా నష్టం



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. పంట చేతికొచ్చి లాభాలు వస్తాయని భావించాను. అయితే ఇటీవల కురిసిన వర్షాల వల్ల 2 ఎకరాల్లో పంట పూర్తిగా నాశనమైంది. ఎకరాకు రూ.50 వేలు చొప్పున రూ.లక్ష దాకా నష్టపోయాను. కేవలం రెండు ఎకరాల్లో మాత్రమే పంట మిగిలింది. పంటలో నీరు పారడంతో భారీగా దెబ్బతింది.

– విజయ్, ఆత్మకూరు రైతు

ప్రభుత్వమే ఆదుకోవాలి

మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. అంతా దెబ్బతింది. పరిహారం చెల్లించాలని వ్యవసాయ అధికారులను కోరాం. అయితే ఎకరాకు ఎంత ఇస్తారో తెలియదు. ఇప్పటికే రెండుసార్లు పంటను వేసి ధ్వంసం చేశాను. మూడోసారి వేసిన పంట వరదల దాటికి కొట్టుకుపోయింది. ఎన్నడూ లేనివిధంగా పంట నష్టం జరిగింది. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు చేశాను. మాలాంటి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మహబూబ్‌బాషా, ఆత్మకూరు రైతు

జాబితా తయారుచేస్తున్నాం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భవనాశి, వరదరాజస్వామి ప్రాజెక్ట్ పొంగి ప్రవహించడంతో ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో మొక్కజొన్న, కంది, మినుము, మిర్చి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రైతుల పేర్లతో జాబితా తయారు చేస్తున్నాం. రైతులు ఎంత మేర పంటలు నష్టపోయారన్న వివరాలను సేకరిస్తున్నాం. – హేమలత, ఇన్‌చార్జ్ ఏడీఏ, ఆత్మకూరు

నేడు స్మృతివనంలో వైఎస్సార్ వర్ధంతి

ఆత్మకూరు: పావురాలగుట్ట పరిధిలోని నల్లకాల్వ వైఎస్సార్ స్మృతివనంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి బైకు ర్యాలీగా నంద్యాల టర్నింగ్ వద్దకు చేరుకుని అక్కడి వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూల మాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. వైఎస్సార్ స్మృతివనం వద్దకు బైకు ర్యాలీగా వెళ్లి దివంగత నేత విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

పాములపాడు: సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన, మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి, జేఈ రాఘవేంద్రప్రసాద్, ఏఈ సువత్సల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచమఠాలలో విశేష పూజలు



పంచమఠాలలోని స్వామివారికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించి ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు, ఉపప్రధానార్చకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్

నందికొట్కూరు: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ సూచించారు. సోమవారం కోర్టు చాంబర్‌లో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థికి అభినందన



నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన పట్టణానికి చెందిన చాకలి పేట ఎల్లస్వామి, పద్మావతి దంపతుల కుమారుడు పి.జగన్నాథం మెడికల్ సీట్ సాధించాడు. దీంతో అధ్యాపకులు సురేష్ బాబు, రమాదేవి, ప్రసాద్, రాధిక, నరేంద్ర, రియాజుద్దీన్ తదితరులు సోమవారం జగన్నాథంను అభినందించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం విద్యార్థులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు షేక్షావలి మాట్లాడుతూ మరణానంతరం నేత్రాలు దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుశేనయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మల్లన్నకు నృత్యార్చన



సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన అభినయ ఆర్ట్స్ అకాడమీ వారిచే భరతనాట్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, వినాయకకౌత్వం, గణనాయక, అయిగిరినందిని, శివాండవ స్తోత్రం, శివలీలలు, శివపార్వతి కల్యాణం, శివతాండవం తదితర గీతాలకు దివ్య, సుదీక్ష, అనసూయ, వినిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

భక్తుడికి ఫోన్ అప్పగింత



భక్తుడికి ఫోన్ అందిస్తున్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి

మహానంది: మార్కాపురం పట్టణానికి చెందిన సుభాన్ కుటుంబ సభ్యులతో సోమవారం మహానందికి వచ్చాడు. కాగా సుపథం మండపాల వద్ద కూర్చున్న వారు ఫోన్ మరిచిపోయి వెళ్లారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ఉద్యోగిని నాయిని శ్రీదేవి ఫోన్ గుర్తించి సీఆర్ఓ కౌంటర్ సిబ్బంది నాగార్జునరెడ్డికి అందించడంతో మైకులో అనౌన్స్ చేశారు. బాధితుడు రావడంతో ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి మొబైల్‌ఫోన్ అందివ్వగా వారు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వినయకా.. మన్నించు!



పూర్తిస్థాయిలో మునగని గణనాథుల ప్రతిమలు

జూపాడుబంగ్లా: ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథుల ప్రతిమలను భక్తులు నిమజ్జనం విషయంలో కాస్త నిర్లక్ష్యం ప్రదర్శించారు. కేసీ కాల్వలో నీటిమట్టం తగ్గటంతో ప్రతిమలు పూర్తిగా మునగలేదు. కొన్ని విగ్రహాలు 50 శాతం, మరికొన్ని విగ్రహాలు 80 శాతం మునిగినా.. తలలు పైకి కనిపిస్తూ ఉండటంతో పలువురు భక్తుల హృదయాలను కలిచివేస్తోంది. వినాయకా మన్నించు అంటూ వేడుకున్నారు.

వినాయకుడికి భక్తుల పూజలు



వినాయకుడి విగ్రహం వద్ద అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు

శ్రీశైలంటెంపుల్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గణపయ్యలను నెలకొల్పారు. వీధివీధినా గణేష్ మంటపాలను ఏర్పాటు చేసి, వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం పాదుపు భవనం ఎదురు హాస్టల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి విశేష పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు.

సిమెంట్ రోడ్లు వేయాలి

జూపాడుబంగ్లా: తమ గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయాలని మండలంలోని భాస్కరాపురం గ్రామస్తులు సోమవారం సాయంత్రం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రూ.50 లక్షల నిధులు మంజూరైనా పంచాయతీ తీర్మానం లేదన్న సాకుతో సిమెంటు రోడ్లు నిర్మించకపోవటం తగదన్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయమై అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని, దోమలు వ్యాపించి రోగాలు ప్రబలుతున్నాయని వార్డు మెంబర్లు పుల్లయ్య, స్వామన్న, శ్రీనివాసులు, వీరస్వామి, దేవభూషణం, శివచెన్నయ్య, రాజేష్, మద్దిలేటి, పూలరత్నం, సీపీఐ నాయకుడు రమేష్‌బాబు అధికారులు స్పందించి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

జలాశయాల గణన పకడ్బందీగా చేపట్టాలి



బావిని పరిశీలించి సర్వే చేస్తున్న ఏఎస్ఓ, వీఆర్వో, వీఆర్ఏలు

జూపాడుబంగ్లా: చిన్ననీటి వనరులు, జలాశయాల గణన పకడ్బందీగా నిర్వహించాలని ఏఎస్ఓ హనుమంతు వీఆర్వోలకు సూచించారు. సోమవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో చేస్తున్న సర్వేను ఏఎస్ఓ హనుమంతు పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో వీఆర్వో చంద్రశేఖర్‌నాయుడు, వీఆర్ఏలు ఎల్లనాయుడు, శంకర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పాములపాడు: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నామని మండల ప్రత్యేకాధికారి రాజు అన్నారు. సోమవారం తుమ్మలూరు గ్రామంలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునఃపరిశీలనలో కొందరు దివ్యాంగులకు 40 శాతం కంటే తక్కువగా వికలత్వం ఉన్నట్లు నోటీసులందాయన్నారు. అయినా వారికి కూడా ఈనెల పింఛన్లు యథావిధిగా అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, వీఆర్వో ఉశేన్, సర్పంచు వరప్రసాద్ ఉన్నారు.

- **కొత్తపల్లి:** సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని ఎర్రమఠం సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం వారు నల్లబ్యాడ్జీలు ధరించి సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మణి, జూనియర్ లైన్‌మెన్ మునిస్వామి, ఎంపీఈఓ రాజేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ సురేష్, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, సర్పంచు బాలఎల్లయ్య పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** మండలానికి 4,944 పింఛన్లు మంజూరు కాగా సోమవారం సాయంత్రం 5 గంటలకు 4,598 పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మిగతా 346 మందికి మంగళవారం సాయంత్రంలోపు పూర్తి చేస్తామన్నారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని, వాటి పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై జేసీ అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టరాదన్నారు. బాధితులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. వారు ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి పీజీఆర్ఎస్‌కు వస్తుంటారనే విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారికి అర్థమయ్యేలా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ దృష్టికి వచ్చిన వినతుల్లో కొన్ని..

- మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన బోయ వెంకటసుబ్బయ్య మండలంలో ఉన్న అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించి నిజమైన రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని జేసీని కోరారు.
- **జూపాడుబంగ్లా:** రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సచివాలయ విలేజ్ సర్వేయర్లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ణ జేసీ విష్ణుచరణ్‌కు ఫిర్యాదు చేశారు.

10న జాబ్‌మేళా

నందికొట్కూరు: ఈనెల 10న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.సునీత తెలిపారు. సోమవారం అల్లూరు గ్రామంలోని ఎమ్మెల్యే జయసూర్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 ప్రైవేట్ కంపెనీలు జాబ్‌మేళాకు హాజరవుతున్నాయని, పది, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

13న అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు

పగిడ్యాల: ఈనెల 13 నుంచి మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర ఆరు పళ్ల విభాగం వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కోరల సుధాకర్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డి జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ. 35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను విస్మరిస్తూ ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని నందికుంట ఎంపీటీసీ బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యుడినైన తనను పిలవకుండా ఎటువంటి అర్హతలేని టీడీపీ నాయకులతో పింఛన్లు పంపిణీ చేయించడం తగదన్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో కార్మికులకు జీవనాధారం కల్పించండి

వెలుగోడు: ఆటో కార్మికులకు జీవనాధారం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యేసురత్నం మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్సు అమలు చేయడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులు గౌడుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగమోహన్, ఆవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం, వలి, శాలి పైల్వాన్, మెకానిక్ రాజు, నాగన్న, గోవిందరాజు, స్వాములు, లక్ష్మణ్, మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు కొడుతున్న ప్రభుత్వం

మహానంది: కూటమి ప్రభుత్వం పేదల కడుపు కొడుతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ విమర్శించారు. సోమవారం మహానందిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేద వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పింఛన్ల మీదనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రీవెరిఫికేషన్ పేరుతో అర్హులైన వారి పింఛన్లు తొలగించడం బాధాకరమన్నారు. నిలిపేసిన పింఛన్లను పునరుద్ధరించాలని, అబ్బీపురం, మహానంది సమీపంలోని చెంచులక్ష్మి కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఆర్.సామేలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయాలి

నందికొట్కూరు: గవర్నమెంట్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తాగునీరు సరఫరా చేయలేని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు ఆది, శ్యాంనాయక్, సూరి, శివ, జగదీష్, అంజి, తదితరులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం కూడా నాసిరకంగా పెడుతున్నారని ఫిర్యాదు చేశారు.

నేడు బహిరంగ విచారణ

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమ్మర్ సోమవారం తెలిపారు.

మల్లన్నకు సహస్ర దీపార్చన సేవ





దీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు, స్వామిఅమ్మవార్లకు వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు అలంకార మండపంలో మహానందీశ్వర దంపతుల ఉత్సవమూర్తులను అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలతో పాటు బలిహరణల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు. రాత్రి 9.30 గంటలకు యాగశాలలో ఏకాంత సేవ పూజలు చేపట్టారు.

మహానందిలో జిల్లా అడిషనల్ ఎస్పీ పూజలు



అడిషనల్ ఎస్పీ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

మహానంది: జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, సౌజన్య దంపతులు కుటుంబ సమేతంగా సోమవారం రాత్రి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. వారికి ముందుగా ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

ఆత్మకూరు: ఎల్ఐసీ వార్షికోత్సవాన్ని స్థానిక కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈనెల 5వ తేదీ వరకు బీమా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు బ్రాంచి మేనేజర్ పాండురంగనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రవికుమార్, నాగన్న, శోభారాణి, సుచిత్ర, రవీణ్, లియాఫీ నాయకులు అబ్దుల్, కరీం, సాయిరాం, స్వామిదాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భవనాశి విస్తరణ పనులు చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పాములపాడు: భవనాశి వాగు విస్తరణ పనులు చేపట్టాలని మండలంలోని ఇస్కాల గ్రామ రైతులు సోమవారం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామ పొలిమేరలో భవనాశి వాగు కింద సుమారు 800 ఎకరాల పొలం ఉందని, వర్షాలు కురిసినప్పుడల్లా నల్లమల అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు భవనాశి వాగులోకి చేరుతుందని, వాగు వెడల్పు తక్కువగా ఉండటంతో పొలాల్లోకి చేరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లుందని వివరించారు. ఈ ఏడాది వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మరింత నీటి ఉధృతితో మంటలన్నీ నీట మునిగాయని రైతులు వాపోయారు. సర్వే చేసి భవనాశి వాగు విస్తరణ పనులు చేపట్టి తమను ఆదుకోవాలని వారు కోరారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారులు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ రైతులు రమణారెడ్డి, మనోహర్‌రెడ్డి, జయరాజు, బాషు, పెద్ద లక్ష్మయ్య, శంకరరెడ్డి, రమణారెడ్డి, నాగిరెడ్డి, బాలక్రిష్ణ, అంబన్న తదితరులు పాల్గొన్నారు.